7

సాక్షి బాపట్ల

ఆదివారం । 17 । నవంబర్ । 2024



నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

శావల్యాపురం: శావల్యాపురంలోని నిదానంపాటి అమ్మవారి తిరునాళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి కోటపాటి మృత్యుంజయుడు, లక్ష్మీ పార్వతి దంపతులు రూ.1,01,116 అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4513 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2460 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

పోలీస్ శాఖలో నిఘా విభాగం కీలకం

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల టౌన్: పోలీస్ శాఖలో నిఘా విభాగం కీలకమైందని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లాలోని నిఘా విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రహస్య సమాచారం సేకరించాల్సిన విధానం, వ్యవహరించాల్సిన తీరుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీస్ శాఖ సమర్థంగా విధులు నిర్వహించేందుకు, అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయడానికి ముందస్తు సమాచారం వేగవంతంగా సేకరించడం కీలకమని తెలిపారు. నిత్యం ప్రజలతో మమేకమవ్వాలని, గతంలో నేరాలకు పాల్పడిన వారు, చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. మాదక ద్రవ్యాల అమ్మకం, వినియోగం, పేకాట, కోడి పందేలు తదితర అసాంఘిక కార్యకలాపాల గురించి ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ నారాయణ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలనతో ప్రయాణికుల్లో భరోసా

ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం షమీమ్



అద్దంకి: సమయపాలనతో ప్రయాణికుల్లో ఆర్టీసీపై భరోసా కల్పించవచ్చని నెల్లూరు డివిజన్ ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం షమీమ్ తెలిపారు. ఆమె శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. అనంతరం కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు ఆర్టీసీపై నమ్మకం ఏర్పడితే ఓఆర్ పెంచుకోవచ్చని చెప్పారు. డ్యూటీలో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు అరగంట ముందు వచ్చి బస్సును చెక్ చేసుకోవాలని, స్టాప్‌లో పావుగంట ముందుగానే పెట్టాలని తెలిపారు. సరైన సమయానికి బస్సును నడపాలని చెప్పారు. కేఎంపీఎల్ అధికంగా తెచ్చినవారికి, అత్యధిక ఆదాయం తెచ్చిన సిబ్బందికి బహుమతులు పంపిణీ చేశారు. అద్దె బస్సుల సిబ్బందికి కూడా శిక్షణ ఉంటుందని, ఆయా బస్ డ్రైవర్లను శిక్షణకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి. రామమోహనరావు, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ కళాశాల్లో పలు పోటీలు

బాపట్ల: 2024–25 వార్షిక రెండో దశ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఆదివారం నుంచి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ కళాశాలలో ప్రారంభం కానున్నాయని డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ జి. కరుణా సాగర్ తెలిపారు. 20వ తేదీ వరకు జరిగే పోటీల్లో విశ్వవిద్యాలయానికి చెందిన 19 అనుబంధ కళాశాలలకు చెందిన 612 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా క్రీడా పోటీల్ని కళాశాల ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్పోర్ట్స్ పెవిలియన్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆర్. శారదా జయలక్ష్మీ దేవి, గౌరవ అతిథిగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గుంటూరు డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ తదితరులు పాల్గొంటున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనా రాణి తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ విభాగాధిపతి ఎం.సురేష్ కుమార్, ఎం. రమాదేవి, టి. ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

అమరేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమరావతి: అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుడిని హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు అర్చకులు జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు స్వాగతం పలికారు.

పుడమి పులకించేలా... గ్లోబ్ నమూనా రూపొందించిన విద్యార్థులతో వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్‌రావు



ప్రతిభాలోత్సవ్!

- తెలుగుపై మమకారాన్ని చాటిన బాలలు
- అలరించిన నృత్య ప్రదర్శనలు
- సామాజిక స్పృహ చాటిన నాటికలు
- రెండవ రోజూ చిన్నారుల సందడి



జాన'పాదం'... జానపద నృత్యం చేస్తున్న ఓ విద్యార్థిని



నాట్య మయూరాలు.. నృత్య ప్రదర్శనకు సిద్ధమైన బాలికలు

పెదకాకాని: ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ – 2024 వేడుకల్లో చిన్నారులు రెండవ రోజైన శనివారం కూడా సందడి చేశారు. పద్యపఠనం, ఏకపాత్రాభినయం, శాస్త్రీయ, జానపద నృత్యాలతో వీవీఐటీ కళాశాల పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు తెలుగు భాష, సంస్కృతిపై మమకారాన్ని చాటి చెప్పారు.

మూడు రోజుల బాలోత్సవ్ వేడుక శుక్రవారం ప్రారంభం కాగా... శనివారం ఉత్సాహంగా సాగింది. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కొనసాగుతున్న ఈ వేడుకకు సందర్శకులు పెద్దసంఖ్యలో వచ్చారు. ప్రాంగణం కళకళలాడింది. 230 పాఠశాలల నుంచి 2,500 మంది పోటీల్లో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 250 జానపద నృత్యాలు ఎందడిగా సాగాయి. 31 నాటికలు సమాజం పట్ల వారికున్న దృక్పథాన్ని చాటాయి. సమాజానికి హితవు పలికేలా సాగుతూ ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు, వక్తృత్వ పోటీలు వారిలోని సృజనాత్మకతను వెలికితీశాయి. బాలల అనుభవాలు, ఆలోచనలు నేటి సమాజానికి ఉపయోగపడేలా న్యాయ నిర్ణేతలు ప్రత్యేక సూచనలు చేశారు. వాద్య సంగీత పోటీలు ఆకట్టుకున్నాయి. కథా సమాహారం పంచతంత్రం తెలుగు అనువాద గ్రంథం వీవీఐటీ 32వ ప్రచురణను సంస్థ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, కొత్తగూడెం బాలోత్సవ్ సృష్టికర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, పోటీల విజేతలు ఆవిష్కరించారు.



చైతన్య సారథులు... సమాజంలోని సమస్యలపై నాటిక ప్రదర్శిస్తున్న బాలలు



అభి'నవ' ప్రతిభ..
సత్యభామ వేషధారణలో ఓ బాలిక

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట బురిడీ

- ప్రజలను మోసగిస్తున్న వ్యక్తి అరెస్ట్
- వాహనంపై ఎమ్మెల్యే పాస్ స్టికర్

రేపల్లె రూరల్: ప్రభుత్వ ఉద్యోగినని.. సచివాలయంలో ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులు చాలా మంది తెలుసునని... డబ్బులిస్తే ఉద్యోగమిస్తానంటూ ఎమ్మెల్యే కార్ పాస్ సిక్టర్‌ను ఏర్పాటు చేసుకుని ప్రజలను మోసగిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. నిందితుడి వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం నిడమానూరులోని శ్రేష్ అట్మాస్ఫియర్ అపార్ట్‌మెంట్‌లో మోర్ల మహీధర్ నివాసం ఉంటున్నాడు. తాను సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగినని చెప్పుకుంటున్నాడు. రెండు నెలల క్రితం రేపల్లె పట్టణం 3వవార్డుకు చెందిన దేవగిరి రవిశంకర్ పనిపై వెలగపూడిలోని సచివాలయానికి



నిందితుడితో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది

వెళ్లాడు. ఈ సమయంలో రవిశంకర్‌ను మహీధర్ పరిచయం చేసుకున్నాడు. తాను సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగినని నమ్మించాడు. ఉన్నత ఉద్యోగులు, మంత్రులు బాగా తెలుసునని, వారితో మాట్లాడి ఉద్యోగం ఇప్పిస్తానని, తరువాత పర్మినెంట్ చేయిస్తానని ఆశ చూపాడు. దీనికి రూ.4లక్షలు డిమాండ్ చేశాడు. హైకోర్టు జడ్జీలలో సైతం తనకు బంధువులని, అక్కడ కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి 8 గంటలకు మహీధర్ రేపల్లెలోని రవిశంకర్ ఇంటికి వచ్చి డబ్బులు తీసుకున్నాడు. అయితే, మహీధర్ కారు లోపలి భాగంలో ఏపీ లెజిస్లేటర్ సెక్రటరీ ఫోర్జరీ సంతకంతో ఎమ్మెల్యే 90–రేపల్లె కార్‌పాస్ ఉండటంతో రవిశంకర్ మహీధర్‌ను ప్రశ్నించాడు. దీంతో మహీధర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మోసపోయానని గ్రహించిన రవిశంకర్ రేపల్లె సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 15న మహీధర్‌ను అతని ఇంటి వద్ద అరెస్ట్ చేశామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. నకిలీ పాస్ స్టికర్ వాడుతున్న కారుతో పాటు అతనికి చెందిన మరో రెండు కార్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్‌పాస్ స్టికర్లతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో

ఆహ్లాదకర వాతావరణానికి కృషి

- జిల్లా కలెక్టర్ వెంకట మురళి
- విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులకు ఆదేశం

బాపట్ల/ చీరాల టౌన్ : సముద్ర తీరం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కోసం విస్తృతంగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బాపట్ల, చీరాల మండలాలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కార్తిక మాసం సందర్భంగా బాపట్ల సూర్యలంక బీచ్ ని సందర్శించారు. పర్యాటకులు విస్తృతంగా బీచ్‌కి వస్తున్నందున వసతులను పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను ఆరా తీశారు. స్నానాల తర్వాత దుస్తులు మార్చుకోవడానికి చేసిన ఏర్పాట్లపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీచ్ వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటి, పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పెంచేలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. బీచ్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల పరిధిలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం, పాండురంగాపురం బీచ్‌లు పర్యాటకులను ఆకట్టుకునేలా చేయాలని ఆదేశించారు. కనీసం 10 ఎకరాలలో మొక్కల నాటడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

- చీరాల వాడరేవును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అసోసియేషన్ అతిథి గృహాన్ని ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. సంపద సృష్టించే కార్యక్రమంలో భాగంగా బీచ్‌ల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా సుందరీకరణ చేస్తామని చెప్పారు. వాడరేవులోని పోర్టు పోరంబోకు భూమిలో విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. ఆయన వెంట డ్వామా పీడీ విజయలక్ష్మి, అటవీశాఖ



వాడరేవు మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్

అధికారి భీమయ్య, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, తహసీల్దార్లు గోపీకృష్ణ, సలీమా ఉన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లను నాణ్యతతో నిర్మించాలని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. పశ్చిమ బాపట్ల వైఎస్సార్ నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న రోడ్లను ఆయన పరిశీలించారు. వలస కూలీలను నివారించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని అధికారులకు తెలిపారు. స్వగ్రామంలోనే వారికి ఉపాధి పనులు చూపించాలని ఆదేశించారు. కూలీలకు కనీస వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉపాధి పనుల్లో అక్రమాలు చోటుచేసుకోకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి జి. వాణి

బాపట్ల టౌన్: బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాపట్ల సీనియర్ సివిల్‌జడ్జి జి. వాణి తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన అంశాలపై శనివారం పట్టణంలో హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జి. వాణి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ, బాలలందరూ బడిలో ఉండేలా చూడటం, సమతుల పౌష్టికాహారం అందించడం, ఆదరణ, రక్షణ లేని బాలలకు రక్షణ అందించడం లాంటి అంశాలపై సమన్వయ ప్రణాళిక అవసరమని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచనలు ఇచ్చారు. ఇందులో పారా లీగల్ వలంటీర్ల సేవలను కూడా ఉపయోగించుకోవాలని తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమా మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో కట్టడి చేస్తున్నామని తెలిపారు. ఆదరణ, రక్షణ కోల్పోయిన పిల్లలను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశపెట్టి పునరావాసం కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ఆరోగ్య ప్రమీల మాట్లాడుతూ నేరాల్లో బాధిత బాలికలకు సపోర్ట్ పర్సన్ సహకారం అందించేలా చేయాలంటే పోలీసులు పోక్సో కేసు వివరాలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అందించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ బాలలు బడి మానివేయడానికి వలస, అవగాహన లేకపోవడం, ఆర్థిక సవాళ్లే కారణమని



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

పేర్కొన్నారు. బాల్య వివాహం ఇంకా సమస్యగా ఉందని అది విద్యకు అడ్డంకిగా మారుతోందని తెలిపారు. బాలల రక్షణ కమిటీలను బలోపేతం చేసి స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో చట్టాలపై అవగాహన తీసుకొస్తే బాలిక విద్య ప్రాముఖ్యత పెరిగి బాల్య వివాహాలు ఆగుతాయని సూచించారు.బాపట్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బాలహక్కులు కాపాడే క్రమంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. డీఎస్పీ జి. రామాంజనేయులు మాట్లాడుతూ బాలలకు అన్యాయం జరిగినప్పుడు సత్వరమే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సహకారం తీసుకోవాలని తెలిపారు. కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.వి. శివప్రసాద్ మాట్లాడుతూ బాలలను పనుల్లో పెట్టుకున్న యజమానులపై కేసులు పెడుతున్నామని, నష్టపరిహారాన్ని బాలలకు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ డైరెక్టర్ పి. ఫ్రాన్సిస్ తంబి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు, సూపర్వైజర్లు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, బాలికా చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సీఐ, లేబర్ ఆఫీసర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకోండి

- ఐటీడీపీ, కూటమి పోస్టులపై దృష్టి సారించాలి
- నిత్యం మాజీ సీఎం వైఎస్. జగన్, ఆయన కుటుంబ సభ్యులపై మితిమీరిన పోస్టులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై తెలుగుదేశం పార్టీ అనుబంధ సోషల్ మీడియా విభాగం ఐ–టీడీపీ, కూటమి సోషల్ మీడియా చేస్తున్న అత్యంత నీతి బాహ్యమైన పోస్టులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ సీఐ ఆర్. అహ్మద్‌జానీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాకు సంబంధించిన యువతీ యువకులపై ఒక పథకం ప్రకారం దాడి చేసిన అనంతరం అత్యంత నీతి బాహ్యమైన సోషల్ మీడియా పోస్టులను ఐ–టీడీపీ మరింత వేగం పెంచిందని తెలిపారు. సీఐకి ఫిర్యాదు చేసిన వారిలో బాపట్ల పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు జోగి రాజా, బాపట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొక్కిలగడ్డ చెంచయ్య, సర్పంచ్ బొలిమేర అనిల్, మాజీ సర్పంచ్ ఇసాక్, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాష్, గునివిని మణిరెడ్డి, నక్క సోమిరెడ్డి, కటికల యేహోషువా, పాలపర్తి గోపీకృష్ణ ఉన్నారు.



పట్టణ సీఐకి ఫిర్యాదు చేస్తున్న నేతలు

క్లుప్తంగా

డీఎస్సీ ఉద్యోగాలకు ప్రభుత్వం ఉచిత శిక్షణ

కలెక్టర్ జె వెంకట మురళి

బాపట్ల: డీఎస్సీ ఉద్యోగాలకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇవ్వడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు స్థానిక సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ప్రారంభ సూచికగా జ్యోతి వెలిగించి డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో 700 పోస్టులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వమే 220 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రావీణ్యం పొందిన వారితో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కష్టపడి చదవండి, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగాలు పొందాలని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఎస్ రాజశేఖర్‌బాబు, జిల్లా బీసీ సాధికారత ఇన్‌చార్జి అధికారి రాజేష్ దాసు, తహసీల్దార్, సలీమా, ఏపీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

కవాతుతో క్రమశిక్షణ



నగరంపాలెం: కవాతుతో క్రమశిక్షణ అలవాటవుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ కవాతు మైదానంలో శనివారం పోలీస్ అధికారులు, సిబ్బంది కవాతు నిర్వహించారు. పోలీసుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కవాతుతో శారీరక దృఢత్వం తోపాటు క్రమశిక్షణ, ఓర్పు అలవాటవుతాయని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, కవాతు పరేడ్ కమాండర్ ఆర్‌ఐ సూర్యభాస్కర్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పక్కనున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) కార్యాలయాన్ని ఎస్పీ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఐలు శ్రీహర్‌రెడ్డి, శివరామకృష్ణ, పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్

తాడేపల్లి రూరల్: పేదరికం పూర్తి నిర్మూలించేలా ఆర్థిక వికాసానికి తోడ్పడేందుకు మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ ప్రారంభించామని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మెప్మా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28,77,109 మంది మహిళలకు 2.79 లక్షల సంఘాల ద్వారా ఆర్థిక సాధికారత దిశగా కృషి చేస్తోందని చెప్పారు. సభ్యుల వివరాలను నాలుగు స్థాయిలలో తనిఖీ చేయిస్తామన్నారు. సంఘ గ్రేడింగ్ బట్టి భవిష్యత్తు కార్యక్రమాలను నిర్దేశిస్తామని తెలిపారు. ఈ నెల 8 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌పీలతో సమాచారం సేకరించి డిసెంబర్ నెలలో డేటా వ్యాలిడేషన్‌ను పూర్తి చేస్తామని వివరించారు.

కూటమి కుట్రలపై

పోరాట ఘనత కార్యకర్తలదే !

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- కేసులు పెట్టినంత మాత్రాన భయపడేదే లేదు
- గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల



మాట్లాడుతున్న అంబటి రాంబాబు, వేదికపై అంబటి మురళీకృష్ణ, మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో కుట్రలు చేస్తున్నా భుజానికెత్తుకున్న వైఎస్సార్ సీపీ జెండాను కిందకు దింపకుండా మొక్కవోని ధైర్యంతో పోరాడుతున్న ఘనత కార్యకర్తలదేనని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. గుంటూరు నగరం బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పొన్నూరు నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం జరిగింది. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఒక విష సంస్కృతికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందన్నారు. కార్యకర్తలు, సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌లను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ సమయంలో కూటమి కుట్రలపై పోరాడేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కేసులు పెడితే భయపడతామా?

వైఎస్సార్ సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా లీగల్ విభాగం కమిటీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏ ఇబ్బంది కలిగినా నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకుంటామని పేర్కొన్నారు. దాడులు, దౌర్జన్యాలతో కూటమి రాక్షస పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని దాటుకుని పార్టీని పటిష్టపరిచేలా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని సూచించారు. వారి వెంట తామంతా నడుస్తామని స్పష్టం చేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ చెప్పారు. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన వారికి ప్రాధాన్యం దక్కేలా చూస్తామన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా.. కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. ఓడిపోయామనే నిరుత్సాహాన్ని వీడి ప్రతి కార్యకర్త సైనికుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్నివర్గాల గురించి నిత్యం ఆలోచించే గొప్ప మనసున్న వ్యక్తి వైఎస్ జగన్ అని తెలిపారు. కచ్చితంగా భవిష్యత్తు మనేదనని, కూటమిపై ప్రజల్లో కేవలం ఐదు నెలల కాలంలోనే నమ్మకం పోయిందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పార్టీని మరింత పటిష్ట పరచాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కీలకం

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జాతీయ రహదారులపై పెద్ద వాహనాలు మాత్రమే తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను సర్వీస్ రోడ్లకే పరిమితం చేయాలని సూచించారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల మరమ్మతులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగితే వెంటనే నేషనల్ హైవే అథారిటీ హెల్ప్ లైన్ నెంబర్ 1033 కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పట్టణంలో అనేక చోట్ల ట్రాఫిక్ సిగ్నలింగ్ లైట్లు పనిచేయడం లేదని, వాటిని త్వరగా మరమ్మతులు చేయాలన్నారు. కొన్ని ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగా, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటంతోనే జరుగుతున్నాయని కలెక్టర్ వివరించారు.

సెల్లార్లలోనే పార్కింగ్ చేయాలి: ఎస్పీ

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందన్నారు. వ్యాపారులు తమ వాహనాలను సెల్లార్లలోనే పెట్టుకోవాలని సూచించారు. కేవలం వ్యాపారమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా గుర్తెరగాలని పేర్కొన్నారు. రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు అవకాశమున్న వారు సమీపంలోని హాస్పిటల్స్‌కు క్షతగాత్రులను తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో డీటీసీ కె.సీతారామిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిశీలించి, నిర్దేశిత వ్యవధిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ద్వితీయ శ్రేణి అధికారుల గ్రీవెన్స్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కాకాని శివాలయానికి కార్తిక శోభ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కార్తిక మాసం సందర్భంగా భక్తులతో కళకళలాడింది. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. యజ్ఞాల బావి వద్ద కార్తిక మాస స్నానాలు చేసిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శివాలయ ప్రాంగణంలో ఇంటి నుంచి తెచ్చుకున్న పూజాద్రవ్యాలతో దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏక వారాభిషేక పూజలు, అన్నప్రాసనలు, నామకరణలు, రాహు కేతు పూజలు అధికసంఖ్యలో జరిగాయి. రాత్రి సమయంలో కార్తిక దీప కాంతులతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం

జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

కారంచేడు: ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ అలుపెరుగని, నిరంతర పోరాటాలు చేస్తూ అనేక సమస్యలకు పరిష్కారం చూపించిందని బాపట్ల జిల్లా అధ్యక్షుడు జే వినయ్‌కుమార్ అన్నారు. కారంచేడు యూపీ పాఠశాలలో శనివారం రాత్రి నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూనే ఉందని తెలిపారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు, ఎంఈఓలు ఎంవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, కుర్రా శ్రీనివాసరావు, జే వినయ్, ఎం వెంకటేశ్వరెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, రావి పద్మావతి, మీరావలి, సీహెచ్ తిమోతీ, రమేష్ రెడ్డి, పావులూరి శ్రీనివాసరావు, అంకిరెడ్డి, యూ భవానీప్రసాద్, శీరం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజానికి దిక్సూచిలా ఉండాలి

కలెక్టర్ జె. వెంకట మురళి

బాపట్ల: జర్నలిస్టులు సమాజానికి దిక్సూచిలా ఉండాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఆయన శనివారం శుభాకాంక్షలు తెలిపారు. పాత్రికేయులు స్థానిక కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో సీనియర్ పాత్రికేయులకు శాలువాలు కప్పి, పుష్పమాలలతో సత్కరించారు. జర్నలిస్టుల పిల్లలందరికీ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో జర్నలిస్టులంతా కలిసి కలెక్టర్‌ని సన్మానించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా జర్నలిస్టులు పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అత్యంత వేగంగా ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: మాదక ద్రవ్యాలను తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్ఓ ఎ.వి.శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలానికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ బాషి ప్రస్తుతం యానాదికాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతనితోపాటు గుంటూరులోని నెహ్రూనగర్‌కు చెందిన పఠాన్ మున్నా, అరుంధతీనగర్‌కు చెందిన ముక్కంటి రాము అలియాస్ రవి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం ఏటుకూరు రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డు వద్ద బెంగళూరు నుంచి తీసుకొచ్చిన 15 గ్రాముల మాదక ద్రవ్యం 'మెత్'ను మూడు ప్యాకెట్లు చేసి పంచుకుంటున్న సమయంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మెత్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 50వేలకు పైగా ఉంటుందని తెలిపారు. నిందితుల్లో షేక్ గౌస్‌బాషాపై లాలాపేట పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని చెప్పారు. గతంలో గంజాయి విక్రయం, ప్రస్తుతం మెత్‌ను బెంగళూరు నుంచి ఇతడే తీసుకొచ్చినట్లు గుర్తించారు. పఠాన్ మున్నాపై కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసు ఉందని వివరించారు. ముక్కంటి రాము అలియాస్ రవిపై పాతగుంటూరు, అరండల్‌పేట పోలీసు స్టేషన్ల పరిధిలో గంజాయి, చోరీ కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు, ఆర్.అనంతకుమార్, కానిస్టేబుల్ పి.కిరణ్, ఎ.రాంబాబు, ఎం.కళ్యాణ్, అప్పలనాయుడు, తిరుమలరావులను డీఎస్పీ అభినందించారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

నడిరోడ్డుపై మహిళలతో అసభ్య ప్రవర్తన



నిందితుడు విజయ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఓ యువకుడు మహిళలతో నడిరోడ్డుపై అసభ్యంగా ప్రవర్తించాడు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు మూడు బొమ్మల సెంటర్ వద్ద ఈ ఘటన జరిగింది. విజయ్ అనే యువకుడు మొదట రోడ్డు వెంబడి వెళ్లే విద్యార్థినులను వెంబడించగా, వారు భయంతో పారిపోయారు. తర్వాత తనకు ఎదురుగా వస్తున్న మహిళ చేయి పట్టుకుని అతడు లాక్కెళ్లబోయాడు. సదరు మహిళ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి విజయ్‌ను అడ్డుకున్నారు. తర్వాత తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. స్థానికులు పట్టుకున్న సమయంలో అతడు తన వద్దనున్న గంజాయి పొట్లాన్ని పిచ్చి మొక్కలలోకి విసిరివేశాడని అక్కడున్నవారు తెలిపారు. విజయ్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు. విజయ్ మద్యంగానీ, గంజాయిగానీ తాగలేదని, మానసిక పరిస్థితి బాగోలేక అలా ప్రవర్తించి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.





షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

తాడికొండ: తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో శనివారం షూటింగ్ బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు పీఈటీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 23, 24, 25 తేదీలలో అనంతపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను షూటింగ్ బాల్ కార్యవర్గ సభ్యులు రవిబాబు, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, పీఈటీ తదితరులు అభినందించారు. ఉపాధ్యాయులు కిషోర్, నరేష్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.